
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 జనగామ
బుధవారం 21 మే 2025





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

# 'జల్‌శక్తి' వివరాలు నమోదు చేయాలి

- 31లోపు పోర్టల్‌లో పొందు పర్చాలి
- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ కల్చరల్, మే 20(ఆంధ్రజ్యోతి): ఈనెల 31లోగా జల్‌శక్తి అభియాన్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ జల్‌శక్తి అభియాన్‌పై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అటవీ, వ్యవసాయ, ఉద్యాన, ఆర్‌డబ్ల్యూఎస్, భూగర్భ జల శాఖ, సంబంధిత శాఖల సమన్వయంతో జల సంరక్షణ, వర్షపునీటి పెంపుదలకు, ఊట చెరువులు, కందకాలు, చెక్‌డ్యామ్ పనుల్లో భాగంగా చిన్న, సన్నకారు రైతుల పొలంలో పంట కుంటలు, ఊట కుంట తవ్వకం, నదీ పరివాహక ప్రాంతాల్లో చెక్‌డ్యాం నిర్మాణం, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్, స్ట్రక్చర్స్, సాంప్రదాయ నీటి వనరులు, చెరువుల పునరుద్దరణలో చెరువుల పూడిక తీయడం, కాలువల పూడిక తీయడం, బోర్‌వెల్స్ రింగ్ ట్రెంచ్‌లు, రీచార్జ్ పిట్‌ల నిర్మాణం పనులపై పూర్తి వివరాలను ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా జల్‌శక్తి అభియాన్ పోర్టల్‌లో సరైన విధంగా నమోదు చేయాలని సూచించారు. అలాగే ఆయా పనుల చిత్రాలను కూడా స్పష్టంగా ఈనెల 31లోగా నమోదు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్పీసీఈవో మాధురిషా, డిప్యూటీ సీఈవో సరిత, డీఆర్డీవో వసంత, డీఏవో రామారావు నాయక్, డీఈవో భోజన్న, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఏడీఏలు పాల్గొన్నారు.

### దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలి..

స్టేషన్‌ఘన్‌పూర్ (ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టం అమలులో భాగంగా రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారంలో సంబంధిత అధికారులు వేగం పెంచాలని కలెక్టర్ రిజ్వాన్‌బాషా తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో సంబంధిత అధికారులతో భూభారతి దరఖాస్తుల పరిష్కారంపై ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. సదస్సుల ద్వారా ప్రతీ మాడ్యుల్‌లో వచ్చిన వివిధ భూ సమస్యల దరఖాస్తుల పరిష్కారానికి దిశానిర్దేశం చేశారు.ఈ మేరకు సక్సెషన్, పెండింగ్ మ్యుటేషన్, మిస్సింగ్ నంబర్స్, భూసేకరణ, కోర్టు కేసులు, డిజిటల్ సంతకం వంటి మాడ్యుల్‌లలోని సమస్యలను పారదర్శకంగా పూర్తి చేయాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో, త హసీల్దార్ కార్యాలయంకు కలిపి ఇప్పటివరకు 1900 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. కార్యక్ర మంలో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, డిప్యూటీ కలెక్టర్లు సుహాసిని, హనుమాన్‌నాయక్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, డీటీలు సంధ్యారాణి, సునంద, సుమన్, ఆర్‌ఐలు సతీష్, రవీందర్, శ్రీకాంత్, అనిల్, దేవేందర్ పాల్గొన్నారు.

# 1న జిల్లా స్థాయి చైతన్య గీతాల పోటీలు

జనగామ కల్చరల్, మే 20(ఆంధ్రజ్యోతి): ప్రజాకవి జి.వై.గిరి వర్ధంతిని పురస్కరించుకొని జూన్ 1న అభ్యుదయ, సామాజిక చైతన్య గీతాల పోటీలు జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్నట్లు జి.వై.గిరి ఫౌండేషన్ చైర్మన్ జి.కృష్ణ తెలిపారు. మంగళవారం జనగామలో ఐక్యవేదిక వర్కింగ్ కమిటీ సభ్యుల సమావేశం పొట్టబత్తిని భాస్కర్ అధ్యక్షతన జరగగా కృష్ణ మాట్లాడుతూ జూన్ 1న మధ్యాహ్నం 3 గంటలకు జనగామలోని గబ్బెట గోపాల్‌రెడ్డి భవన్‌లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల గాయకులు ఈనెల 30లోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 98484 80442 నంబరులో సంప్రదించాలన్నారు. సమావేశంలో వర్కింగ్ కమిటీ సభ్యులు లగిశెట్టి ప్రభాకర్, అయిలా సోమనర్సింహాచారి, పెట్లోజు సోమేశ్వరాచారి, గడ్డం మనోజ్‌కుమార్, చిలుమోజు సాయికిరణ్, వేముల సదానందం, తాళ్లపల్లి లక్ష్మణ్ గౌడ్, రంగరాజు ప్రసాద్, గొలుసుల నర్సయ్య పాల్గొన్నారు.




# బ్లాక్ స్పాట్!

## హైవేలపై పెరుగుతున్న ప్రమాదాలు

- మృత్యుదారులుగా మారుతున్న రహదారులు
- మూడేళ్లలో 1,133 మంది మృతి
- ప్రమాదాల నివారణకు పోలీసుల చర్యలు
- బ్లాక్ స్పాట్లను గుర్తించి హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



జనగామ- పాలకుర్తి రోడ్డుపై హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

లింగాలఘణపురం, మే 20(ఆంధ్రజ్యోతి): నిత్య ప్రమాదాలతో రహదారులు రక్తసిక్తమవుతున్నాయి. ఎన్నో జీవితాల్లో విషాదాలను నింపుతున్నాయి. నేషనల్ హైవే, ఆర్‌అండ్‌బీ, పీఆర్ రోడ్లు అధ్వానంగా మారడానికి తోడు, అతివేగం ప్రయాణికుల ప్రాణాలను తీస్తోంది. భారీ లోడుతో వెళ్లే వాహనాలు మృత్యు శకటాలుగా మారుతున్నాయి. గడిచిన మూడేళ్లలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధి హన్మకొండ, వరంగల్, జనగామ జిల్లాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 1,133మంది ప్రాణాలు గాల్లో కలిశాయంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. ప్రమాదాల నివారణకు డీసీపీ రాజమహేంద్రనాయక్ ఆదేశాలమేరకు స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ, జనగామ రూరల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, లింగాలఘణపురం ఎస్సై శ్రవణ్‌కుమార్ ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.

### బ్లాక్ స్పాట్ల గుర్తింపు..

జిల్లాలో హైద్రాబాద్-వరంగల్ రహదారి 40 కిలోమీటర్లు, సూర్యాపేట- సిద్దిపేట జాతీయ రహదారి 60కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. మిగతా రోడ్లన్నీ ఆర్‌అండ్ బీ, పంచాయతీరాజ్ రోడ్లే. అతివేగంతో జాతీయ రహదారులపై ప్రమాదాలు జరుగుతుండగా పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రోడ్లపై గుంతలమయమైన రోడ్లతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇందుకోసం యాక్సిడెంట్ ప్రూన్ ఏరియా(బ్లాక్ స్పాట్)లను గుర్తించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. ఎక్కడైతే ఎక్కువగా ప్రమాదాలు జరిగి వాహనదారులు చనిపోయారో ఆ ప్రాంతాల్లో వాహనదారులకు అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పిస్తున్నారు. యాక్సిడెంట్ ప్రూన్ ఏరియాల్లో పోలీసులు తరుచుగా డ్రైంకెన్ డ్రైవ్ టెస్టులు చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 25కిపైగా బ్లాక్ స్పాట్లను గుర్తించిన పోలీసులు రహదారులు రక్తసిక్తం కాకుండా ముందస్తు జాగ్రత్తలను చేపడుతున్నారు.

### హెల్మెట్‌తో ప్రాణాలు సురక్షితం..

జిల్లాలో ఇటీవల జరిగిన రోడ్డుప్రమాదాల్లో చనిపోయిన చాలా మంది హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేసినవారే ఉన్నారు. ఇదే విషయాన్ని వాహనదారులకు పోలీసులు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో లింగాలఘణపురం ఎస్సై శ్రవణ్‌కుమార్ ప్రతీ గ్రామంలో ప్రధాన కూడళ్లలో యువకులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి హెల్మెట్ ప్రాముఖ్యను వివరిస్తున్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్ల జరిగే ప్రమాదాలను, తీసుకోనున్న చట్టపరమైన చర్యలను వివరిస్తున్నారు. లింగాలఘణపురం మండలం నవాబుపేటకు చెందిన 25 ఏళ్ల వయసులోవున్న ఇద్దరు యువకులు రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఒక్క రోజుతేడాతో ఇద్దరు చనిపోవడాన్ని ఉదహరిస్తున్నారు.

### మూడేళ్లలో 1,133 మంది మృత్యువాత

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధి(హన్మకొండ, వరంగల్, జనగామ)లో గడిచిన మూడేళ్లలో ఇప్పటి వరకు జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 1,133 మంది మృతి చెందినట్లు పోలీస్ శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2023లో 499 మంది మృతి చెందగా 117 మంది తీవ్రంగా గాయపడ్డారు. 1,281 మంది స్వల్పగాయాలతో బయటపడ్డారు. 2024లో 459 మంది మృతిచెందగా 91 మంది తీవ్రంగా గాయపడ్డారు. 1,319 మంది స్వల్పగాయాలతో బయట పడ్డారు. 2025లో మే వరకు జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 175 మంది మృతిచెందగా 17మంది తీవ్రంగా గాయపడ్డారు. 484 మంది స్వల్ప గాయాలతో బయటపడ్డట్లు పోలీసు శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.



జనగామ-సూర్యాపేట జాతీయ రహదారిపై ప్రమాదానికి గురైన యువకుడు(ఫైల్)



రోడ్డు ప్రమాదాల నివారణ కోసం చేపట్టాల్సిన చర్యలపై పోలీసులతో మాట్లాడుతున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్(ఫైల్)

## పాముకాటుతో మృతి

చిలుపూర్, మే 20 (ఆంధ్రజ్యోతి) : పాముకాటుతో ఒకరు మృతిచెందిన ఘటన మండలంలోని వెంకటాద్రిపేటలో జరిగింది. ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ కథనం ప్రకారం.. వేలేరు మండలం సోడషపల్లికి చెందిన కాలియా రవి (43) పండ్ల వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వెంకటాద్రిపేటకు చెందిన ఓ రైతు మామిడితోటను గుత్తకు తీసుకుని కుటుంబంతో కలిసి అక్కడే ఉంటున్నాడు. తోటలో నిద్రిస్తుండగా, తెల్లవారుజామున పాము కాటువేసింది. వెంటనే అతన్ని కుటుంబ సభ్యులు ఎంజీఎంకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతిచెందాడు. మృతుడి భార్య పెంటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



రాజిరెడ్డి (ఫైల్)

జఫర్‌గడ్, మే 20 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధ, కుటుంబ కలహాలతో రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కూనూరులో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ బానోత్ రాంచరణ్‌నాయక్ కథనం ప్రకారం. కూనూరుకు చెందిన రొంటాల మల్లారెడ్డికి ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు రాజిరెడ్డి (32)కి ఇదే గ్రామానికి చెందిన మమతతో మూడేళ్ల క్రితం వివాహమైంది. తనకున్న ఎకరంన్నరతోపాటు సోదరుడికి చెందిన ఎకరంన్నర, ఇతరుల మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. సాగుకోసం సుమారు రూ.10లక్షల వరకు అప్పులు చేశాడు. దిగుబడి రాకపోవడంతో చేసిన అప్పుల విషయమై ఇంట్లో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం ఇద్దరి మధ్య గొడవ తలెత్తడంతో భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్థాపం చెందిన రాజిరెడ్డి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. రాజిరెడ్డికి భార్య, కుమారుడు ఉన్నారు. తండ్రి మల్లారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.



పుష్కరిణికి సారె బహూకరిస్తున్న భక్తులు



త్రివేణి సంగమం వద్ద నవరత్న హారతి ఇస్తున్న కాశీ పండితులు




# పుష్కర సరస్వతీ పాహిమాం..

## కాళేశ్వరంలో కొనసాగుతున్న భక్తుల తాకిడి

- ఆరో రోజు 50వేల మంది పుణ్యస్నానాలు
- స్వామివారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు
- కొంత మేరకు తగ్గిన ట్రాఫిక్.. సాఫీగా దర్శనాలు..
- నిరంతరం పర్యవేక్షిస్తున్న భూపాలపల్లి కలెక్టర్, ఎస్పీ

7



నదిలో పుష్కర స్నానం ఆచరిస్తున్న భక్తులు

## మాదిగలకు అన్యాయం



మాట్లాడుతున్న రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని మాజీ ఎమ్మెల్యే రాజయ్య తెలిపారు. మంగళవారం హన్మకొండలోని ఆయన కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. లబ్ధిదారుల ఎంపిక గ్రామసభలో జరగాలి కానీ, నాయకుల ఇళ్లల్లో జరుగుతోందని ఆరోపించారు. మాదిగల సహకారంతో సీఎం స్థాయికి ఎదిగానని మాట్లాడే సీఎం రేవంత్ రెడ్డి 17 నెలల పాలనలో మాదిగల కోసం ఒక్క పథకం కూడా ప్రవే శపెట్ట లేదన్నారు. అంబేద్కర్ అభయహస్తం పథకం పేరుతో దళితులకు రూ 12లక్షల ఆర్థికసాయం చేస్తామని చెప్పి నేటికి అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం దళితులను మోసం చేసిందన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవ ర్గంలో 35శాతం ఉన్న మాదిగలకు ఇందిరమ్మ ఇండ్ల విషయంలో కాని ప్రభు త్వ పథకాల అమలు విషయంలో అదే స్థాయిలో ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు.


## గెలుపునకు కృషి చేయాలి




సమావేశంలో మాట్లాడుతున్న పాలకుర్తి ఎమ్మెల్యే

పాలకుర్తి, మే 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల గెలుపుకోసం ప్రతీ కార్యకర్త కృషి పనిచేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పాలకుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల కాంగ్రెస్ సన్నాహక సమావేశం జరగ్గా ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి బలమైన చరిత్ర ఉందని గతంలో ప్రజలకు చేసిన సేవలను గుర్తు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుతోపాటు చేసిన అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. పని చేసే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. పాలకుర్తి ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతీ గ్రామంలో బూత్‌స్థాయి నుంచి కార్యచరణ రూపొందించాలన్నారు.

## జీపీ రికార్డుల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న పింకేష్‌కుమర్

పాలకుర్తి, మే 20 (ఆంధ్రజ్యోతి): నారబోయినగూడెంను మంగళవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ పింకేష్‌కుమార్ సందర్శించారు. ఈసందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని నర్సరీ కంపోస్ట్ షెడ్, వైకుంఠథామ స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాములు, డీపీవో స్వరూప, ఏపీవో మంజుల, ఎంపీవో రవీందర్, జీపీ కార్యదర్శి పరశురాములు పాల్గొన్నారు.

# ఝాన్సీరెడ్డిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



దేవరుప్పుల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

దేవరుప్పుల, మే 20 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుపై తొర్రూర్‌లో సోమవారం పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై మండల బీఆర్‌ఎస్ శ్రేణులు మంగళవారం దేవరుప్పుల పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సృజన్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. తొర్రూర్‌లో జరిగిన సమావేశంలో దయాకర్‌రావుపై అనుచిత వ్యాఖ్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. దేవరుప్పుల బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు పల్లా సుందర్ రామ్‌రెడ్డి మాట్లాడుతూ 'మా ఫ్యామిలీ జోలికి వస్తే మాత్రం బతకవు.. పర్మినెంట్‌గా పర్వతగిరిలోనే ఉంటవు. వారిని, వీరిని ఎగదోసి మాపైకి పంపిస్తున్నావంటూ' వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. అధికారంలో ఉన్నామని అడ్డగోలుగా మాజీ మంత్రిపై ఝాన్సీరెడ్డి వ్యాఖ్యలు చేయడం మంచిది కాదని, అధికారం ఎవరికీ శాస్వతం కాదన్నారు. ఝాన్సీరెడ్డి, దయాకర్‌రావు మధ్యలో ఏవైనా మనస్పర్థలు ఉంటే కూర్చొని మాట్లాడుకోవాలే తప్ప నోరు పారేసుకోవడం సరికాదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాము తప్పకుండా ప్రశ్నిస్తామని, పాలకుర్తి నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ చేస్తామని, రైతులకు సాగునీరు అందిస్తామని మాట తప్పింది అన్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. సమాధానం చెప్పలేక విమర్శలు చేయడం తగదన్నారు.

ఆమె తీరు మారకపోతే నియోజకవర్గంలో ఝాన్సీరెడ్డిని స్వేచ్ఛగా తిరుగనివ్వమని అడుగడుగునా అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, నాయకులు బస్వ మల్లేశం, చింత రవి, కూతాటి నర్సింహులు, కొల్లూరు సోమయ్య, గండిపెల్లి యాకయ్య, హన్మంతు, వేణుయాదవ్, చింత యాదగిరి, రామ్‌సింగ్, చింత రవి, వంగ అర్జున్, సోమనర్సయ్య, నవీన్‌నాయక్, ఏల సుందర్, గడ్డం రాజు, తిరుమలేష్, కాడబోయిన యాదగిరి పాల్గొన్నారు.

## డీఎస్‌టీ నిబంధనల మేరకే నిర్వహణ

**టీజీ కాస్ట్ సభ్య కార్యదర్శి ● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన**

హనుమకొండ కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి): భారత శాస్త్ర, సాంకేతిక శాఖ(డీఎస్‌టీ) నిబంధనల మేరకే హనుమకొండ హంటర్‌రోడ్‌లోని సైన్స్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన ఎస్సీ, ఎస్టీసెల్ ప్రాజెక్టు నిర్వహణ జరుగుతుందని, ఇందులో ఎలాంటి అక్రమాలకు తావులేదని టీజీకాస్ట్ సభ్య కార్యదర్శి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17,18తేదీలలో 'ఆంధ్రజ్యోతి'లో సైన్స్ సెంటర్‌పై ప్రచురితమైన వరుస కథనాల నేపథ్యలో టీజీకాస్ట్ సభ్య కార్యదర్శి ఈ ప్రకటన ద్వారా వివరణ ఇచ్చారు. 3 ఏళ్ల కాల వ్యవధికి ఏర్పాటు చేసిన ఈ ప్రాజెక్టు ద్వారా 10వేల ఎస్సీ కుటుంబాలు, 8వేల ఎస్టీ కుటుంబాలను సర్వే చేశామని, ఆయా కుటుంబాల జీవనోపాధి, విద్య, ఆరోగ్యం సంప్రదాయ కార్యకలాపాలపై సేకరించిన అంశాలను సెస్, టిస్‌లు సర్వే రిపోర్టులు సమర్పించాయన్నారు. డీఎస్‌టీ నిబంధనల ప్రకారమే క్షేత్రస్థాయి సర్వేకు ఎస్సీ, ఎస్టీ సెల్‌లో పనిచేస్తున్న సిబ్బందిని పంపించామన్నారు. ప్రమాద ఖర్చుల చెల్లింపులో ఎలాంటి అవకతవలు జరగలేదన్నారు. మిగిలిన పనులను పూర్తిచేయడంతో పాటు ప్రాజెక్టు కాలపరిమితి పెంపునకు డీఎస్‌టీ జీఓఐను కోరామన్నారు. ప్రాజెక్టు అమలు మొత్తం జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో జరిగిందన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



రాములు

చెన్నారావుపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం రోడ్డుప్రమాదంలో ఒకరు మృతి చెందారు. స్థానికులు, ట్రైనీ ఎస్సై చిలువేరు రోహిత్ కథనం ప్రకారం.. చెన్నారావుపేటకు చెందిన మగ్రి రాములు (65) సైకిల్‌పై వెళ్లి పాల బాటిళ్లను ఇచ్చి ఇంటికి వస్తున్నాడు. అదేసమయంలో నర్సంపేట నుంచి నెక్కొండకు వస్తున్న టాటాఏస్ సెంటర్ వద్ద ఎదురుగా ఢీకొట్టింది. సైకిల్‌పై ఉన్న రాములు రోడ్డుపై పడి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్‌ను గ్రామస్థులు పోలీసులకు అప్పగించారు. రాములుకు భార్య సమ్మక్క, ఒక కుమారుడు రాజు, ఒక కుమార్తె ఉంది. కుమారుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ ఎస్సై వివరించారు.

## మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య



రంజిత్

నెక్కొండ, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిట్టకాలుబోడు గ్రామానికి చెందిన బానోత్ రంజిత్ (28) జీవితంపై విరక్తి చెంది మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మహేందర్ మంగళవారం తెలిపారు. రంజిత్ తన కుటుంబ సభ్యులతో హైదరాబాద్‌లో ఉంటూ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఆరు నెలల కిందట రంజిత్ భార్య ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయంలో రంజిత్ జైలుకు వెళ్లి వచ్చాడు. ప్రస్తుతం పిట్టకాలుబోడులో ఉంటున్నాడు. మానసిక ఒత్తిడితో మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తితో ఈ నెల 18న గడ్డిమందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు ఎంజీఎం దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 19న రాత్రి మృతి చెందాడు. మృతుడి అన్న బానోత్ రవి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. రంజిత్‌కు 10, 8 ఏళ్లున్న ఇద్దరు కుమారులు ఉన్నారు.





పరిపాలనా భవనం ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థులు



పరీక్షల తీరును పరిశీలిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం

# నిరసనల మధ్య పీజీ పరీక్షలు ప్రారంభం

**● వాయిదా వేయాలని విద్యార్థుల ఆందోళనలు ● క్యాంపస్‌లో పోలీసుల పహారాతో పరీక్షల నిర్వహణ**

కేయూ క్యాంపస్ మే 20, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో మంగళవారం ఎం.ఎ, ఎంకాం, ఎంఎస్సీతో పాటు ఇతర పీజీ కోర్సుల అఖరు సెమిస్టర్ పరీక్షలు రసాభాసా మధ్య ప్రారంభమయ్యాయి. సోమవారం రాత్రి పరీక్షలను వాయిదా వేయాలని విద్యార్థులు కేయూ మొదటి గేటు వద్ద నిరసన ఆందోళనలు చేపట్టారు. నిరసన చేపట్టిన విద్యార్థులను పోలీసులు అడ్డుకుని వర్సిటీ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మంగళవారం ఉదయం అల్పాహార సమయంలో విద్యార్థులందరూ తమ పరీక్షలను వాయిదా వేయాలని మళ్లీ ఆందోళనకు దిగారు. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డిని కలిసి తమ బాధలను చెబుతామంటూ నిరసనకు దిగిన విద్యార్థులను పోలీసులు అడ్డుకున్నారు. పరిపాలన భవనం ఎదుట పోలీసులు మోహరించి విద్యార్థులను అక్కడ నిరసన చేపట్టకుండా అడ్డుకున్నారు. దీంతో విద్యార్థులు వీసీ లాడ్జ్ వద్దకు చేరుకున్నారు. వీసీ రావాలంటూ నిరసన చేపట్టారు. విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో వీసీ ప్రతాప్‌రెడ్డి విద్యార్థులకు నచ్చచెప్పి పరీక్షలు రాయాలని సూచించారు. దీంతో విద్యార్థులు శాంతించారు. పరిపాలన భవనం వద్ద నిరసన చేపట్టిన విద్యార్థులను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, కేయూ పాలనమండలి సభ్యులు, లా కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ బి.సురేశ్‌లాల్ విద్యార్థులకు నచ్చ చెప్పారు.

### పరిపాలన భవనం వద్ద స్వల్ప తోపులాట

వర్సిటీలో సోమవారం రాత్రి నుంచి విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తడంతో పోలీసులు వర్సిటీలో భారీగా మోహరించారు. పరీక్షలు వాయిదా వేయలంటూ విద్యార్థులు.. యథావిధిగా నిర్వహిస్తామని అధికారులు ప్రకటించడంతో వర్సిటీలో తీవ్ర ఉత్కంఠ కొనసాగింది. మంగళవారం ఉదయమే పరిపాలన భవనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని అక్కడకు వచ్చి నిరసన చేపట్టేందుకు ప్రయత్నించిన విద్యార్థులను అడ్డుకున్నారు. పరిపాలన భవనం ఎదుట మహిళ పోలీసులకు, విద్యార్థులకు మధ్య స్వల్పతోపులాట చోటుచేసుకుంది. విద్యార్థులను పోలీస్ వ్యాన్ ఎక్కించేందుకు ప్రయత్నించగా విద్యార్థులు మూకుమ్మడిగా అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు దురుసుగా ప్రవర్తించారని విద్యార్థులు ఆరోపించారు.

### పరీక్షల తీరును పరిశీలించిన వీసీ, రిజిస్ట్రార్

కాకతీయ యూనివర్సిటీలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగిన పరీక్షల నిర్వహణతీరును కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి బీఎస్ఎల్ సౌజన్య, క్యాంపస్ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.మమత పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులులేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

# మూడు రోజుల పాటు జీవవైవిధ్య కార్యక్రమాలు

- రేపటి నుంచి 25వ తేదీవరకు నిర్వహణ
- బైక్ ర్యాలీ, అటవీ ఉత్పత్తుల సంత, పిచ్చుక గూళ్ల పంపిణీ
- 24, 25న అడవిలో బస, నడక

హనుమకొండ, మే 20 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 22న బైక్ ర్యాలీని నిర్వహించనున్నారు. పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక, ఏడబ్ల్యుఎల్ఎస్, వీఎస్ఎస్, గ్రామ భారతి, జనవిజ్ఞాన వేదిక, ప్రేరణ విద్యా వికాస, సెంటర్ ఫర్ పీపుల్స్ ఫారెస్ట్ సంస్థల సంయుక్తాధ్వర్యంలో చేపట్టనున్న ఈ ర్యాలీని గురువారం ఉదయం 5.45 గంటలకు సుబేదారిలోని అటవీశాఖ కార్యాలయం నుంచి ప్రారంభమై ధర్మసాగర్ మండలం దేవునూరు ఇనుపరాతి గట్టు అటవీ ప్రాంతం వరకు సుమారు 20 కి.మీ. సాగుతుంది. తిరిగి సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు కొనసాగుతుంది. అలాగే గ్రామ భారతి, సెంటర్ ఫర్ పీపుల్స్ ఫారెస్ట్ ఆధ్వర్యంలో దేశీ విత్తనాలు, అటవీ ఉత్పత్తులు, సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల సంత ఏర్పాటు ఉంటుంది. పాముల పరిరక్షణపై అవగాహన, జీడబ్ల్యుఎంసీ, డీఆర్‌డీవో కిందటేడు నాటిన మొక్కల ప్రథమ జన్మదినోత్సవం, కొత్త మొక్కలను నాటడం, ప్రేరణ విద్యా వికాస సంస్థ బట్ట సంచులు, చింతగట్టు గోశాల పిచ్చుక గూళ్ల ఉచిత పంపిణీ ఏడబ్ల్యుఎల్ వన్యప్రాణి ఛాయాచిత్ర గ్యాలరీ, అటవీ శాఖ (పరిశోధన) మొక్కల సేంద్రియ, వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన తదితర కార్యక్రమాలను నిర్వహిస్తారు. ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ ప్రేమికులు, కార్యకర్తలు, ఔత్సాహికులు ఈ కార్యక్రమాలకు హాజరుకావాలని పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కాజీపేట పురుషోత్తం కోరారు.

మరిన్ని వివరాలకు 8328026266, లేదా 9948609591 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు. ఈనెల 24న ఉదయం 6 నుంచి 8 గంటల వరకు జీవవైవిధ్య దినోత్సవ వేడుకల ముగింపు కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఈనెల 24 సాయంత్రం అడవిలో బస, 25న ఉదయం 6 నుంచి 8 గంటల వరకు అడవిలో నడక, వన్య సందర్శన నిర్వహిస్తారు. ఇందులో పాల్గొనడానికి మొదట పేర్లు నమోదు చేసుకున్న 20 మందికి మాత్రమే అవకాశం ఉంటుంది.

## ప్రైవేట్ బస్సుల ఓనర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యవర్గం



అధ్యక్షుడు లక్కం శ్రీధర్



ప్రధాన కార్యదర్శి అనిల్‌గౌడ్

హనుమకొండ చౌరస్తా, మే 20(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు బస్సు ఓనర్స్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా లక్కం శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా పెరుమాండ్ల అనిల్‌గౌడ్ ఏకగ్రీవంగా నియమితులయ్యారు. మంగళవారం హనుమకొండ చౌరస్తా సమీపంలోని ఏనుగుల గడ్డలో ప్రైవేటు బస్సు అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా చింతలపుడి క్రాంతికుమార్, కోశాధికారిగా అనిశెట్టి శ్యామ్, సభ్యులుగా మార్క కోటేష్, కొత్త కిరణ్‌కుమా ర్, పట్నంశెట్టి శైలేష్ ప్రసాద్, ఎం.డి. ఫిరోజ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాలకు వెళ్లే ప్రైవేటు బస్సులకు పన్ను మినహాయింపు కోసం కృషి చేస్తామని తెలిపారు. ప్రైవేటు విద్యా సంస్థల బస్సులను వివిధ శుభాకార్యాలకు వెళ్లకుండా అరికడుతామని వారు తెలిపారు.

## రేపు ఉమ్మడి జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్, మే 20(ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ డీఎస్ఏ బాక్సింగ్‌హాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్స్ బాలబాలికల విభాగంలో నిర్వహించనున్న బాక్సింగ్ ఎంపికలో 1 జనవరి 2009 నుంచి 31డిసెంబర్ 2010 సంవత్సర మధ్యకాలంలో జన్మించిన వారు పాల్గొనవచ్చునని ఆయన వెల్లడించారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈనెల 24న మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటారని రాజేందర్ తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు తమ ఆధార్‌కార్డు, పాఠశాల నుంచి జారీచేసిన బోనఫైడ్ సర్టిఫికెట్, జీడబ్ల్యూఎంసీ నుంచి జారీచేసిన జనన ధ్రువీకరణ పత్రంతో పాటు రెండు పాస్‌పోర్టు సైజ్‌ఫొటోలను వెంట తీసుకొని ఈ నెల 22న డీఎస్ఏ బాక్సింగ్‌హాల్లో ఉదయం 7గంటలకు రిపోర్టు చే యాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు సెల్ 9959711609 నెంబర్‌లో సంప్రదించాలని రాజేందర్ కోరారు.



పిల్లల కోసం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

## పుస్తక పఠనం వ్యక్తిత్వ వికాసానికి దోహదం

**నవచేతన విజ్ఞాన సమితి గవర్నింగ్‌బాడీ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**

హనుమకొండ చౌరస్తా, మే 20(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనం వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందని నవచేతన విజ్ఞాన సమితి గవర్నింగ్‌బాడీ సభ్యుడు తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం హనుమకొండ అశోక కాంప్లెక్స్‌లోని నవచేతన బుక్‌హౌస్ ఆధ్వర్యంలో వేసవి సెలవుల సందర్భంగా పిల్లల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుస్తక పఠనంతో మేధో సంపత్తి పెంపొందుతుందని, అందుకే ప్రతి ఒక్కరూ పుస్తకాలను నిరంతరం చదువుతూ ఉండాలని ఆయన కోరారు. నవచేతన బుక్‌హౌస్ మేనేజర్ ఎర్ర నాగరాజు మాట్లాడుతూ.. జూన్ నెల 10వరకు ఈ పుస్తక ప్రదర్శన కొనసాగడంతోపాటు అన్ని రకాల పుస్తకాలపై 10శాతం నుంచి 30శాతం వరకు ప్రత్యేక తగ్గింపు ధరలకు అందిస్తుందన్నారు.

ఈ పుస్తక ప్రదర్శనలో వివిధ రకాల పబ్లిషర్స్ రచయితలు, కవులు, రచించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లాలోని విద్యా సంస్థలు, మేధావులు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాగరాజు కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అరసం కార్యదర్శి డాక్టర్ మార్క శంకర్ నారాయణ, సీపీఐ పార్టీ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, టీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, నాయకులు ఏదునూరి వెంకట్రాజం, దండు మోహన్, ఎం.డి.ఉస్మాన్‌పాషా, తాండూరి గోపి, పి.కిశోర్‌కుమార్, సిబ్బంది రమేష్, సూర్యప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

## దేశసేవకు వెళ్లి.. విగతజీవిగా ఇంటికి..

**నర్సంపేటకు చేరిన నాగరాజు భౌతిక కాయం ● కన్నీరు మున్నీరైన కుటుంబ సభ్యులు**



నర్సంపేటలో నాగరాజు భౌతికకాయం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

నర్సంపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లో విధులు నిర్వర్తిస్తున్న వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణానికి చెందిన బీఎస్ఎఫ్ జవాన్ సంపంగి నాగరాజు(28) సర్వీస్ గన్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆలస్యంగా తెలిసింది. కశ్మీర్‌లోని సాంబా జిల్లా సరిహద్దులో విధులు నిర్వర్తిస్తున్న నాగరాజు తన సర్వీస్ గన్‌తో మూడురోజుల కిందట కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని ఆర్మీ అధికారులు గోప్యంగా ఉంచడంతో కుటుంబసభ్యులకు ఆలస్యంగా సమాచారం అందింది. మంగళవారం ఉదయం 7గంటలకు జవాన్ భౌతికకాయాన్ని అంబులెన్స్‌లో నర్సంపేటలోని పాకాల రోడ్‌లోని ఆయన స్వగృహంలో కుటుంబ సభ్యులకు అధికారులు అప్పగించారు. ఆకస్మాత్తుగా నాగరాజు విగతజీవిగా రావడంతో ఆయన అతడి భార్య, తల్లిదండ్రులు విజయ- మల్లయ్య, కుటుంబసభ్యుల రోదన పలువురిని కంటతడి పెట్టించింది.

కాగా, నర్సంపేటకు చెందిన విజయ - మల్లయ్య దంపతులకు ముగ్గురు (సాయికుమార్, వెంకటేశ్, నాగరాజు) కుమారులు ఉండగా, చిన్నవాడైన నాగరాజు 2016లో బీఎస్ఎఫ్‌లో చేరాడు. ఆయన వివిధ విభాగాల్లోని సెక్టార్లలో 6ఏళ్ల పాటు విధులు నిర్వహించాడు. మూడేళ్లుగా కశ్మీర్‌లోని సాంబా సెక్టార్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. కాగా, మానసిక ఒత్తిడితో మూడు రోజుల కిందట నాగరాజు సర్వీస్ గన్‌తో కాల్చుకుని మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. అయితే తమ కుమారుడు మూడు రోజుల కిందట ఆత్మహత్యకు పాల్పడితే ఆర్మీ అధికారులు వెంటనే సమాచారం అందించలేదని, కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. నాగరాజు మృతదేహానికి హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

### కాంగ్రెస్ నాయకులు నివాళి

నాగరాజు భౌతికకాయంపై కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, మాజీ కౌన్సిలర్ ఎలకంటి విజయ్‌కుమార్, ఓర్సు అంజలి, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మాదాసి రవికుమార్, మార్కెట్ డైరెక్టర్ కొల్లూరి మధుకర్, నాడెం నగేశ్, బానాల శ్రీను నివాళులర్పించారు.

# తినుబండారాలపై తనిఖీలేవీ?

**సోయిలేని ఆహార నియంత్రణ శాఖ అధికారులు**

**ఇష్టారీతిన వ్యవహరిస్తున్న హోటల్ యజమానులు**

**అపరిశుభ్రత, కల్తీ ఆహారం తిని రోగాలబారిన ప్రజలు**

బాలసముద్రం, మే 20 (ఆంధ్రజ్యోతి): వరంగల్ మహా నగరంలోని హోటళ్లపై తనిఖీలు కరువై వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆహార పదార్థాల పరిశుభ్రత, కల్తీ నివారణను నియంత్రించాల్సిన అధికారులు సక్రమంగా విధులు నిర్వహించకపోవడంతో వ్యాపారులకు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో అతి పెద్ద నగరంగా విరాజిల్లుతున్న వరంగల్ నగరానికి సుదూర గ్రామాల నుంచి వివిధ అవసరాలకు ప్రజలు వేలాదిగా వస్తుంటారు. వారికి ఆకలి వేసినప్పుడు ఆకలి బాధను తీర్చుకోవడానికి హోటళ్లను రోడ్ల వెంట ఆహార పదార్థాలను విక్రయించే వారిని ఆశ్రయిస్తుంటారు. దీంతో నగరవ్యాప్తంగా ఆహార వ్యాపారం జోరుగా సాగుతోంది. వ్యాపారులు లాభాలు ఆర్జించడానికి చవకైన కల్తీ నూనెలు ఆహార దినుసులతో ఆహార పదార్థాలను తయారు చేస్తున్నారు. ఆహార పదార్థాల తయారీపై నియంత్రణ కొరవడి వ్యాపారాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. హైదరాబాద్ నుంచి వచ్చిన రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ అధికారులు కొద్ది నెలల కిందట నగరంలోని పేరొందిన హోటళ్లలో జరిపిన ఆకస్మిక దాడుల్లో విస్తుపోయే విషయాలు వెలుగు చూశాయి. కుళ్లిన మాంసం, కాలం చెల్లిన సుగంధ ద్రవ్యాలు, బూజుపట్టిన కూరగాయలు ఆహార పదార్థాల్లో వినియోగించే విషపూరితమైన రంగులు వెలుగు చూశాయి. పైన పటారం, లోన లొటారం అన్న చందంగా ఉన్నాయి. వినియోగదారులకు ఆహార పదార్థాలను వడ్డించే హాల్ అపరిశుభ్రంగా ఉండి వంటశాలలో శుచి శుభ్రత లేకుండా దుర్వాసన రావడం అధికారులు గమనించారు. పేరొందిన పెద్ద హోటళ్లలోనే పరిస్థితి ఇలా ఉంటే.. ఇక మామూలు సాధారణ హోటళ్లలో పరిశుభ్రత ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఇటీవల నగరంలో టాస్క్‌ఫోర్స్ పోలీసు అధికారులు పలు చోట్ల ఐస్‌క్రీమ్ పార్లర్లపై జరిపిన దాడుల్లో కాలం చెల్లిన ఐస్‌క్రీమ్‌లను కనుగొని కేసులు నమోదు చేశారు. కానీ నగరంలో విధులు నిర్వహించే ఫుడ్ సేఫ్టీ అధికారులు ఎక్కడ తనిఖీలు నిర్వహించిన దాఖలాలు కనిపించకపోవడంతో హోటల్ వ్యాపారానికి ఆటంకం లేకుండా పోయింది. నిత్యం ఆహార పదార్థాల తయారీ, అమ్మకాలపై నియంత్రణ కొనసాగించాల్సిన అధికారులకు ఎందుకు సోయి లేకుండా పోయిందని ప్రజలు వాపోతున్నారు.

## పుష్కర జలాలతో నాగేంద్రుడికి అభిషేకం



మల్లెపూల అలంకరణలో పుష్కర పునీతుడైన నాగేంద్రుడు

గీసుగొండ, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊకల్‌లో గల సుప్రసిద్ధ నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నాగేంద్రుడికి సరస్వతీ పుష్కర వేడుకలను మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళేశ్వరం త్రివేణి సంగమంలో అంతర్వాహిణిగా ప్రవహిస్తున్న సరస్వతీ నది జలం, పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మల్లెపూలతో అలంకరించి ప్రత్యేక అర్చనలు, పూజలు చేశారు. పుష్కర పునీతుడైన నాగేంద్రుడిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యతో తరలివచ్చి పూజలు చేసి తరించారు. పుట్టలో పాలుపోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు సముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్ష, ఆలయకమిటీ చైర్మన్ బాబురావు, రాజేందర్, రమేష్, వీరారావు, భక్తులు పాల్గొన్నారు.



108 సిబ్బందికి సూచనలు ఇస్తున్న జిల్లా మేనేజర్ నరేష్

## పుష్కరాల్లో విస్తృతంగా 108 సేవలు

కాళేశ్వరం, మే 20(ఆంధ్రజ్యోతి): పుష్కరాల్లో భాగంగా భక్తులకు 108 అంబులెన్స్‌లు విస్తృతంగా సేవలు అందిస్తున్నాయి. ఈ 108 వాహనాలను భక్తుల సౌకర్యార్థం కాళేశ్వరంలోని పీహెచ్‌సీ, వీఐపీ పుష్కరఘాట్, గోదావరి ఘాట్, ప్రధాన ఆలయం, తాత్కాలిక బాస్టాండ్ వద్ద ఐదు ప్రాంతాల్లో ఏర్పాటుచేసి భక్తులకు అత్యవసర వైద్య సేవలను అందిస్తున్నారు. ఇప్పటివరకు మూడు వందల మంది భక్తులకు 108 అంబులెన్స్ ద్వార అత్యవసర వైద్య సేవలను అందించినట్లు జిల్లా మేనేజర్ నరేష్ తెలిపారు. వైద్య సేవలకు కోసం ఫోన్ రాగా ముందుగా రోగులను పీహెచ్‌సీ తరలించిన అక్కడి నుంచి మహాదేవపూర్ సీహెచ్‌సీకి తరలిస్తున్నారు. ఐదు అంబులెన్స్‌లు, 20మంది సిబ్బందితో 24 గంటలు వైద్య సేవలు అందిస్తున్నట్లు జిల్లా మేనేజర్ పేర్కొన్నారు. అలాగే మరో ఐదు బైక్ అంబుటెన్స్‌ల ద్వార సుమారు పది వేల మందికి ఫస్ట్ ఎయిడ్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించినట్లు తెలిపారు.

### హెడ్ కానిస్టేబుల్‌కు అస్వస్థత

సరస్వతీ పుష్కరాల్లో భాగంగా ప్రధాన ఘాట్ వద్ద విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ గోల్‌కు ఛాతిలో నొప్పి రావడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనంలో పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అలాగే పుష్కర ఘాట్ వద్ద తీవ్ర అస్వస్థతకు గురైన విజయవాడకు చెందిన కిష్టమూర్తిని, బాలకృష్ణలను 108 వాహనంలో పీహెచ్‌సీకి మెరుగైన చికిత్స నిమిత్తం తరలించారు. పుష్కర ఘాట్ వద్ద మధుమితకు ఫిట్స్ రావడంతో అస్వస్థతకులోనై అపస్మారకస్థితిలోవెళ్లడంతో వరంగల్‌ఎంజీఎంకు తరలించారు.



వీఐపీ ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన అగ్నిమాపక వాహనం

## నాలుగు అగ్నిమాపక శాఖ సేవలు

కాళేశ్వరం, మే 20(ఆంధ్రజ్యోతి): పుష్కరాల్లో భాగంగా నాలుగు అగ్నిమాపక వాహనాలను అధికారులు అందుబాటులో ఉంచారు. ఎస్డీఆర్ఎఫ్ బృందాలతో కలిసి సేవలందిస్తున్నారు. చెన్నూర్, భూపాలపల్లి, ములుగు, వరంగల్‌కు చెందిన నాలుగు వాహనాలు సరస్వతీ పుష్కర ఘాట్, ఆలయం వద్ద, హెలిప్యాడ్ వద్ద వీటిని అందుబాటులో ఉంచారు. ఏదైనా అగ్నిప్రమాదం లేక విపత్తు సంభవించినప్పుడు సేవలందించనున్నారు. సుమారు వంద మంది సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారు.

పుష్కరఘాట్ వద్ద పుణ్య స్నానం చేస్తున్న భక్తులు



# పుష్కర సరస్వతీ పాహిమాం..

## కాళేశ్వరంలో కొనసాగుతున్న భక్తుల తాకిడి

- ఆరో రోజు 50వేల మంది పుణ్య స్నానాలు
- స్వామివారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు
- కొంత మేరకు తగ్గిన ట్రాఫిక్.. సాఫీగా దర్శనాలు..
- పర్యవేక్షిస్తున్న భూపాలపల్లి కలెక్టర్, ఎస్పీ

కాళేశ్వరం, మే 20 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీ నదీ పుష్కరాలకు భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఎండలను సైతం లెక్కచేయకుండా జనం తరలివస్తున్నారు. ఆరో రోజైన మంగళవారం దాదాపు 50వేల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. పుష్కరాల్లో పలువురు ప్రముఖులు పుణ్య స్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి సృజన, ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి, ఐజీ తరుణ్‌జోషి తదితరులు నదిలో పుణ్య స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



### తగ్గిన ట్రాఫిక్.. సాఫీగా దర్శనాలు..

కాళేశ్వరం పుష్కరానికి వచ్చే భక్తుల సంఖ్య కాస్త తగ్గుముఖం పట్టడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తలేదు. రెండు మూడు రోజులుగా వేలాది మంది భక్తుల రాకపోలతో ట్రాఫిక్‌కు అనే ఇబ్బందులు తలెత్తాయి. ఈ నేపథ్యంలో మంగళవారం రద్దీ లేకపోవడంతో వాహనాల రాకపోకలు సాఫీగా సాగాయి. వాహనదారులు పార్కింగ్ స్థల సమీపానికి వెళ్లి దగ్గరలోనే ఉన్న పుష్కరఘాట్‌లో పుణ్య స్నానాలు ఆచరించారు. అలాగే, దర్శనాల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న భక్తులకు మంగళవారం కాస్త ఉపశమనం కలిగింది. దర్శనాలకు ఎలాంటి ఇక్కట్లు లేకుండా సాఫీగా సాగాయి.

### కలెక్టర్, ఎస్పీ పర్యవేక్షణ

భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరేలు పుష్కరాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. మంగళవారం రెండు ఘాట్ల లో తిరుగుతూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. అటు జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా వాహనాల రాకపోకలను ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరిస్తూ వచ్చారు. అలాగే పుష్కరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడడం కోసం ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సీసీ కెమెరాల ద్వారా పరిస్థితులను సమీక్షిస్తూ పోలీసు అధికారులకు ఎప్పటికప్పుడు తగిన సూచనలు సలహాలు అందించారు.

### పనుల పరిశీలన

ప్రధానంగా మంగళవారం అష్టమి కావడంతో సాధారణంగానే ఇక్కడ పిండ ప్రదాన కార్యక్రమాలను నిలిపివేస్తారు. అదికాకుండా అష్టమి రోజు ప్రయాణాలు చేయడం అరిష్టంగా భావించే సంప్రదాయం ఉండడం వల్ల చాలామంది దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు రెండు రోజులుగా రావడం లేదని భావిస్తున్నారు. అయితే గురువారం నుంచి భక్తుల సంఖ్య మళ్లీ పుంజుకునే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్న అధికార యంత్రాంగం.. మూడు రోజుల్లో ఉత్పనమైన సమస్యలను పునరావృతం కాకుండా చూసేందుకు ముందస్తు చర్యలు ప్రారంభించారు. ముఖ్యంగా సరస్వతీ ఘాట్‌కు వెళ్లే దారిని మరింత విస్తరించి రేలింగ్ చేశారు. భక్తుల రాక వల్ల రోడ్డుపై దుమ్మురేగకుండా ట్యాంకర్ల ద్వారా నీళ్లను కుమ్మరిస్తూ క్యూరింగ్ చేస్తున్నారు.

### నవరత్న హారతి లైవ్

పుష్కరాల సందర్భంగా పుష్కర ఘాట్‌లో ప్రతీ రోజూ సాయంత్రం ఇస్తున్న నవరత్న హారతీని లైవ్ ద్వారా ప్రజలు, భక్తులు వీక్షించేందుకు ప్రభుత్వం ఆలోచన చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం నుంచి ఆ కార్యక్రమాన్ని లైవ్‌లో ప్రసారం చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రకటిం చారు. పుష్కరాలు ముగిసేంత వరకు ఈ కార్యక్రమం కొనసాగించనున్నారు.

## స్వల్పంగా పెరిగిన నదీ జలాలు

కాళేశ్వరం, మే 20(ఆంధ్రజ్యోతి) : ఎగువన కురుస్తున్న వర్షాల వల్ల నదీ జలాలు పెరగడంతో సరస్వతి పుష్కర ఘాట్ (త్రివేణి సంగమం) వద్ద జలకళ సంతరించుకుంది. మూడు రోజులతో పోలిస్తే నదిలో ప్రవాహం పెరిగింది. నదిలో ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. రానున్న మూడు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో మరింత ప్రవాహం పెరిగే అవకాశం ఉందని పలువురు బావిస్తున్నారు.

## అందుబాటులో ఎలక్ట్రికల్ వాహనాలు

కాళేశ్వరం, మే 20 (ఆంధ్రజ్యోతి) : దేవాదాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ శైలజరామయ్యర్, కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశాల మేరకు తెలంగాణ టూరిజం ఆధ్వర్యంలో మూడు ఎలక్ట్రికల్ వాహనాలు(బగ్గీ)లు అందుబాటులోకి వచ్చాయి. ఈ వాహనాల్లో భక్తులను ఆలయం నుంచి పుష్కర ఘాట్ వద్దకు, పుష్కర ఘాట్ నుంచి తాత్కాలిక బస్టాండ్ వరకు ఉచితంగా చేరవస్తున్నారు. ఇందులో ఒక్కసారి పది మంది వరకు వెళ్లే వెసులుబాటు ఉంది. ఉచితంగా ఏర్పాటు చేయడంపై భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఎలక్ట్రికల్ వాహనంలో భక్తులను తరలిస్తున్న సిబ్బంది



ముక్తీశ్వరుడి దర్శనం కోసం క్యూ కట్టిన భక్తులు

## వైభవంగా త్రివేణి సంగమానికి నవరత్న హారతి




**తిలకించిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు**

కాళేశ్వరం, మే 20(ఆంధ్రజ్యోతి): శ్రీ కాళేశ్వర క్షేత్ర త్రివేణి సంగమంలో సరస్వతీపుష్కరాలను పురస్కరించుకుని సోమవారం రాత్రి 7.20గంటల నుంచి 8గంటల వరకు ఏడుగురు కాశీ పండితులు నవరత్న హారతిని వైభవంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక సంగీత నేపథ్యంతో ఓంకార, నాగ, పంచ, సూర్య, చంద్ర, నంది, సింహ, కుంభ, నక్షత్ర హారతులతో కూడిన నవరత్న హారతిని పండితులు నిర్వహించారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పలు శాఖల అధికారులు, వందలాది మంది భక్తులు తిలకించారు. సుమారు గంటపాటు నిర్వహించిన నవరత్న హారతి కార్యక్రమంలో ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి, కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నవరత్న హారతిని వీక్షిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, అధికారులు, భక్తులు



విద్యలో రాణించాలని సరస్వతి మాతకు మొక్కుతున్న యువతులు



పుష్కరిణికి వడిబియ్యం, సారె సమర్పిస్తున్న భక్తులు

## సంచార బయో టాయిలెట్స్ ఏర్పాటు

కాళేశ్వరం, మే 20(ఆంధ్రజ్యోతి): పుష్కరాలకు వచ్చే మహిళలకు సౌకర్యార్థం సంచార బయో టాయిలెట్స్‌ను సరస్వతీ పుష్కర ఘాట్ వద్ద ఏర్పాటు చేశారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన వాహనాన్ని ఘాట్ వద్ద ఏర్పాటు చేశారు. దీంతో మహిళలు విరివిగా సంచార బయో టాయిలెట్స్‌ను వినియోగించుకుంటున్నారు. సంచార బయో టాయిలెట్స్ ఏర్పాటుపై మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పుష్కర ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన సంచార బయో టాయిలెట్ వాహనం

## ప్రమాదాలకు ఆస్కారం లేకుండా..


కాళేశ్వరం, మే 20 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం గోదావరిలో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా నివారించడం కోసం అధికార యంత్రాంగం నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫోర్స్(ఎన్‌డీఆర్ఎఫ్), సింగరేణి రెస్క్యూ బృందాలను, గజ ఈతగాళ్లను పుష్కర ఘాట్‌లో మొహరించింది. ఇప్పటి వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటన లు చోటు చేసుకోలేదు మిగిలిన రోజుల్లో కూడా ఎలాంటి ఇక్కట్లు లేకుండా ఉండేందుకు అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపడుతోంది.

# దేదీప్యమానంగా..

## భద్రకాళి చెరువులో 9 ద్వీపాల సుందరీకరణ

- ఇప్పటికే 9 దిబ్బలపై అభివృద్ధి పనులు పూర్తి
- రూ.3కోట్ల 'కుడా' నిధులతో ద్వీపాల అభివృద్ధి పనులు
- దేశ, విదేశాల పక్షులకు ఆశ్రయం కల్పించేలా చర్యలు
- మూడు మార్గాల గుండా కేబుల్ బ్రిడ్జికి ప్రతిపాదనలు

వరంగల్ కార్పొరేషన్, మే 20 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి దేవాలయాన్ని టూరిజం సర్క్యూట్‌గా తీర్చిదిద్దాలన్న రాష్ట్ర ప్రభుత్వం కలలను అధికారులు ఆచరణసాధ్యంగా చేసి చూపిస్తున్నారు. ఐల్యాండ్స్‌తో పాటు భద్రకాళి బండ్‌ను అనుసంధానం చేస్తూ చెరువు మధ్యలో ఉన్న పెద్ద ఐల్యాండ్ (రిలాక్స్ జోన్) వద్దకు కేబుల్ బ్రిడ్జిని కూడా నిర్మించే ప్రయత్నాలు జరుగుతున్నట్టు అధికారులు వెల్లడించారు. భద్రకాళి చెరువు నుంచి పూడికతీత పనులు జరుగుతుండగానే కుడా అధికారులు ప్రత్యేక నిధులతో యుద్ధప్రాతిప దికన ఐల్యాండ్ పనులు పూర్తిచేశారు. భద్రకాళి చెరువు మధ్యలో ఐల్యాండ్ ఏర్పాటు చేయాలని 2007 నుంచి ప్రయత్నిస్తుండగా, తాజాగా భద్రకాళి చెరువు సుందరీకణ కోసం నీటిని ఖాళీ చేసి పూడికతీత పనులు చేపట్టడంతో సాకారమవుతోంది.



### పక్షులకు ఆశ్రయం.. ప్రజలకు ఆహ్లాదం..

382 ఎకరాల సువిశాల భద్రకాళి చెరువు మధ్యలో ప్రకృతిసిద్ధంగా వెలిసిన ఒక ద్వీపంతో పాటు మరో 8 ద్వీపాలను కృత్రిమంగా తీర్చిదిద్దారు. ఇందుకు గాను ఇప్పటికే రూ.3కోట్ల వరకు ఖర్చు చేసినట్టు కుడా అధికారులు వెల్లడించారు. 3 ఎకరాల్లో ఒక ద్వీపం నిర్మితమై ఉండగా, మరో 8 ద్వీపాలను 5 నుంచి 20గంటల స్థలంలో ఎత్తైన సిబ్బంలను కేంద్రంగా చేసుకుని చెరువు ప్రాంతాన్ని బట్టి 20 నుంచి 30మీటర్ల ఎత్తులో ఐల్యాండ్స్‌ను ఏర్పాటు చేశారు. ఒక్కో ద్వీపం తయారు చేయడానికి రూ.30 నుంచి 50 లక్షలు ఖర్చు చేశారు. మొత్తంగా 9 ద్వీపాలను ఏర్పాటు చేసి ఆహ్లాదాన్ని పంచే ప్రయత్నం చేశారు. ద్వీపాలపై ఇతర దేశాల నుంచి దిగుమతి చేసిన ప్రత్యేక గడ్డితో పాటు బిల్వము, జమ్మి, రావి, వేప, మోదుగు, ఉసిరి చెట్లను నాటుతామని తెలిపారు. మరో రూ.50లక్షలతో మొక్కలు కొనుగోలు చేసి వర్షాకాలం ప్రారంభంలో నాటుతారని చెప్పారు. 3 ద్వీపాలకు విద్యుత్ వెలుతురు అలంకరిస్తుండగా మరో 6ద్వీపాలు పూర్తిగా ప్రకృతి పచ్చదనంతో దేశ విదేశాల పక్షులకు ఆవాస కేంద్రంగా రూపొందించనున్నారు.

**ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నారు..**

వరంగల్ నగరం అభివృద్ధితో పాటు భద్రకాళి చెరువు పూడికతీత, ద్వీపాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ నిధులు మంజూరు చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా భద్రకాళి బండ్ నిర్మాణంలో పాటు చెరువు మధ్యలో ఐల్యాండ్స్, పక్షుల పరిరక్షణ, ప్రజల ఆహ్లాదం కోసం ప్రత్యేక ద్వీపాలు ఏర్పాటు చేస్తున్నాం. వర్షాలు కురిసిన తర్వాత ద్వీపాలు ప్రజలకు వీక్షణ కోసం అందుబాటులోకి వస్తాయి. ఇంకా చెరువు మధ్యలోకి వెళ్లేందుకు అధునాతన కేబుల్ బ్రిడ్జి నిర్మించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

నాయిని రాజేందర్‌రెడ్డి,
వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే

## టూరిస్ట్ హబ్

చెరువు మధ్యలో 9 ద్వీపాలు అభివృద్ధి చేసిన అధికారులు.. కేబుల్ బ్రిడ్జిని నిర్మించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. భద్రకాళి గుడి నుంచి గుట్టకు గుట్ట నుంచి భద్రకాళి బండ్, బండ్ నుంచి మూడు ఐల్యాండ్స్ వద్దకు కేబుల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలతో పలుమార్లు సమీక్షలలో చర్చించినట్టు తెలిసింది. ఈ మేరకు అవిభక్త వరంగల్ జిల్లాలో లక్నవరం తర్వాత అతిపెద్ద కేబుల్ బ్రిడ్జి నిర్మాణం భద్రకాళి చెరువు మధ్యలో నిర్మాణం జరుగనుంది. భద్రకాళి దేవాలయం నుంచి చెరువు మధ్యలో ఉన్న (రిలాక్స్ జోన్) ఐల్యాండ్ వరకు సుమారు 600 నుంచి 700 మీటర్ల పొడవులో కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తే చెరువుతో పాటు ద్వీపప్రాంతమంగా టూరిస్ట్ హబ్‌గా మారు తుందని పలువురు చెప్పుకొస్తున్నారు. అయితే ఐల్యాండ్ డెవలప్‌మెంట్ పనులు భద్రకాళి దేవాలయం, మాడవీధులు, భద్రకాళిబండ్‌ను అనుసంధానం చేస్తూ కేబుల్ బ్రిడ్జి నిర్మాణం చేస్తే ప్రజలకు, టూరిస్టులకు అనుకూలంగా ఉంటుందని మరికొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మరి కొన్నిరోజుల్లో భద్రకాళి చెరువు ద్వీపాలు పర్యాటక ప్రాంతాలుగా కనువిందు చేస్తాయి.

కేబుల్ బ్రిడ్జి నిర్మాణం జరిగే వరకు ఆహ్లాదకారులు ద్వీపాల వద్దకు బోట్స్ రైడింగ్ ద్వారా వెళ్లి రావచ్చని తెలిపారు.

**2005లో ద్వీపం గుర్తింపు**

భద్రకాళి చెరువులో గతంలో నీరు ఇంకిపోయిన సమయంలో చెరువు స్వభావం, స్వరూపం కనిపించేది. 2005లో చెరువు మధ్యలో సుమారు 3 నుంచి 5ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ద్వీపాన్ని అప్పటి అధికారులు గుర్తించారు. ద్వీపం దిబ్బను శుభ్రం చేసి తవ్విచూడగా ప్రాచీన శిల్పాలు, ఆయుధ కర్మాగారం ఉన్నట్టు ప్రాచీనకారులు గుర్తించారు. అంతేకాకుండా ఈ ద్వీపంపై ఆదిమానవులు జీవించినట్టు ఆధారాలు లభించినట్టు చెప్పారు. దిబ్బను ద్వీపంగా మార్చడంతోపాటు ధ్యానం చేయడానికి ప్రత్యేక మందిరం, కేబుల్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కుడా అధికారులు నిర్ధారణకు వచ్చారు. అనుకున్నదే తడవుగా భద్రకాళి దేవాలయం నుంచి చెరువు మధ్యలో ఉన్న దీపం వద్దకు వెళ్లేందుకు కేబుల్ బ్రిడ్జి నిర్మాణం కోసం 2007లో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందుకుగాను రూ.2కోట్ల నిధులు కేటాయించారు. ధ్యాన మందిరం అభివృద్ధి పనులకు మరో రూ.3కోట్లు ఖర్చు అవుతుందని డీపీఆర్‌లు సిద్ధం చేసి అప్పటి ప్రభుత్వానికి పంపగా మంజూరుకాలేదు. అలాగే 365 రోజుల పాటు చెరువు నిండా నీరు ఉండడంతో ఐల్యాండ్ కలగా మారింది.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

## విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే: కలెక్టర్

జనగామ కల్చరల్, మే 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం యశ్వంతాపురం క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో రెండో విడత ఉపాధ్యాయుల వృత్త్యంతర శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. సమాజస్థాపనలో విద్యార్థులను ఉన్నతమైన, ఆదర్శవంతమైన విద్యార్థులుగా సిద్ధం చేయాలని సూచించారు. అందుకు అనుగుణంగా సామర్థ్యాల పెంపునకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులని, తాము నేర్చుకుంటూ విద్యాబోధన చేసినప్పుడే విద్యార్థుల్లో గుణాత్మకమైన మార్పు సాధించవచ్చన్నారు. వేల ఏళ్లుగా ఉన్న అసమానతలు విద్య ద్వారానే తగ్గించే అవకాశం ఉందని, విద్యా ద్వారా జీవన ప్రమాణాలు మెరుగవుతాయన్నారు. అనంతరం జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా దేవరుప్పుల మండలం కడవెండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బడిబాట కరపత్రాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఈవో భోజన్న, ఏఎంవో శ్రీనివాస్, ఏసీజీఈ రవికుమార్, జీసీడీవో గౌసియాబేగం, కోర్సు ఇన్‌చార్జులు మల్లికార్జున్, యాదగిరి, ఆనంద్‌బాబు, ఉపాధ్యాయులు నల్లనాగుల రాజు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలి



గాంధీచౌరస్తా వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): కార్మికులను బానిసలుగా చేసే లేబర్ కోడ్స్‌ను కేంద్రం వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు డిమాండ్ చేశారు. కేంద్రం కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మంగళవారం మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తా వద్ద జీపీ కార్మికులు, సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. రాజు మాట్లాడుతూ కేంద్రం కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. బ్రిటీష్ కాలంలో పోరాడి సాధించుకున్న 44కార్మిక చట్టాలలో 29చట్టాలను, 4లేబర్ కోడ్స్‌గా మార్పు చేయడం దుర్మార్గమన్నారు. లేబర్ కోడ్స్ అమలుతో పనిగంటలు 8నుంచి 12గంటలకు పెరుగుతుందని వాపోయారు. కార్యక్రమంలో మునిసిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నీల శ్రీనివాస్, పూరచందర్, కొంతం చిరంజీవి, బోసు రాజేంద్రప్రసాద్, అమరాజ్ బాబు, ఎడ్ల రాజు, అనిల్, చంద్రమౌళి, వినయ్, స్వామి, శ్రీను, ప్రమోద్, మహేష్, సారయ్య, సుజాత, రేణుక తదితరులు పాల్గొన్నారు.

## ఈజీఎస్‌లో అక్రమాలు సహించం




మాట్లాడుతున్న డీఆర్‌డీవో ఏపీడీ చంద్రశేఖర్

చిలుపూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఈజీఎస్‌లో అవకతవకలను సహించేది లేదని డీఆర్డీవో ఏపీడీ చంద్రశేఖర్ హెచ్చరించారు. మంగళవారం చిలుపూర్‌లోని ఎమ్మార్సీ భవనంలో నిర్వహించిన ఈజీఎస్ సామాజిక తనిఖీ మండల ఫోరం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇప్పటివరకు గ్రామాల్లో చేపట్టిన సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్)కి సంబంధించి గ్రామస్థుల నుంచి వ్యక్తమైన అభ్యంతరాలు, పనుల వివరాలు, నిర్వహణ వ్యయం తదితరాలను ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యదర్శుల సమక్షంలో వెల్లడించారు. ఏపీడీ మాట్లాడుతూ, ఎన్ఆర్ఈజీఎస్‌లో చేపట్టనున్న పనులను పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బర్మావత్ శంకర్, ఎంపీవో శ్రీపాద మధుసూదన్, ఈజీఎస్ ఏపీవో మోహన్‌రావు, ఈసీ కిరణ్‌కుమార్, టీఏలు కుమారస్వామి, చేరాలు పాల్గొన్నారు.

## లో వోల్టేజీ నివారణకు చర్యలు : డీఈ



స్థలాన్ని పరిశీలిస్తున్న డీఈ

జఫర్‌గడ్, మే 20 (ఆంధ్రజ్యోతి): సాగరంలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి మంగళవారం డీఈ రాంబాబు స్థల పరిశీలన జరిపారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి కృషితో ప్రభుత్వం సాగరంలో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో సబ్ స్టేషన్ నిర్మాణం కోసం డీఈ విద్యుత్ అధికారులు, సిబ్బందితో కలిసి మంగళవారం స్థలాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. రాంబాబు మాట్లాడుతూ విద్యుత్ ఉప కేంద్రాల నిర్మాణం వల్ల ఆయా ప్రాంతాల్లోలో వోల్టేజీ, ఓవర్‌లోడ్ సమస్య తొలగిపోతుందన్నారు. ఆయన వెంట ఏఈ కె.విశ్వసాహితీ, ఫోర్‌మెన్ జావిద్, ఎఎల్ఎంలు రంజిత్, ప్రభాకర్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## చిల్డ్రన్స్ హోమ్‌ను సందర్శించిన జడ్జి



జనగామ కల్చరల్, మే 20(ఆంధ్రజ్యోతి): జిల్లా జడ్జి విక్రమ్ చిల్డ్రన్స్ హోమ్‌ను సందర్శించారు. మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జనగామ కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ ఆదేశానుసారం, సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ జనగామలోని బాల సదన్ చిల్డ్రన్స్ హోమ్ ఫర్ గర్ల్స్‌ను సందర్శించారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ రూపొందించిన చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ ఫర్ చిల్డ్రన్స్ స్కీం-2024 ఎల్ఎస్‌యూసీ చట్టంపై అవగాహన కల్పించారు. అక్కడ అందున్న భోజనం, స్నాక్స్, టిఫిన్ గురించి అడిగి తెలుసుకున్నారు. బాలికలు కష్టపడి చదవాలని, చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలని సూచించారు.



# కాంగ్రెస్‌లో వర్గపోరు

- బచ్చన్నపేట కేంద్రంగా రాజకీయాలు
- ఆధిపత్య పోరుతో శ్రేణుల ఆందోళన

బచ్చన్నపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): తమ పార్టీ అధికారంలోకి వచ్చిందని సంతోషడాలో, నేతల మధ్య కొనసాగుతున్న ఆధిపత్య పోరు పడలేక మిన్నకుండి పోవాలో తెలియడం లేదని మండలంలోని కాంగ్రెస్ శ్రేణులు వాపోతున్నాయి. ఎన్నికల అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఓటమి చెందటంతో కొందరు కోవర్టు రాజకీయాలు నడిపారని కాంగ్రెస్‌లోని ఒకవర్గంపై మరోవర్గం రోజూ దుమ్మెత్తి పోతోంది. మధ్యలో సద్దుమణిగినట్టే కనిపించిన మళ్లీ విబేధాలు రచ్చకెక్కాయి. బచ్చన్నపేట కేంద్రంగానే వర్గపోరు ఎక్కువగా కొనసాగుతోందనే చర్చ సాగుతోంది. మండల పార్టీ అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డిపై అసమ్మతితో ఉన్న నాయకులు పదవీచ్యుతున్ని చేసేందుకు కొంత కాలంగా పావులు కదుపుతున్నారు. పలుమార్లు డీసీసీ అధ్యక్షుడి వద్దకు ఫిర్యాదులతో వెళ్లారు. ఇటీవల బాల్‌రెడ్డి వర్గం ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డిని కలువగా, మరుసటి రోజు బచ్చన్నపేటలో మరోవర్గం పెద్ద ఎత్తున సమావేశం ఏర్పాటు చేసి కౌంటర్ ఇచ్చేసింది.

ఇటీవల ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఎవరికి వారే లేఖలతో సిఫార్సు చేయడం, పేర్లు తొలగించడం అంతర్గతంగా పెద్ద రాద్ధాంతం నడిచినట్టు చెబుతున్నారు. నేతల మధ్య సఖ్యత లేకపోవడంతో ఇన్‌ఫార్మర్‌లుగా కొంతమందిని ఏర్పాటు చేసుకున్నట్టు చెబుతున్నారు. ఎవరిని ఎవరు కలుస్తున్నారో నిఘా పెడుతున్నారు. తమకు వ్యతిరేకంగా పనిచేసే వారికి ఏకంగా వార్నింగ్‌లు ఇస్తుండటంతో గ్రామస్థాయి లీడర్లు బెంబేలెత్తిపోతున్నారు. తాము కలుస్తున్న సమాచారం ఎలా లీకవుతుందో తెలియక సదరు నాయకులు తలల పట్టుకుంటున్నారు. ఇదెక్కడి సంస్కృతి అంటూ ముఖ్యనేతల తీరుపై బాహాటంగానే అసంతృప్తిని వెళ్లగక్కుతున్నారు. సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కుల విషయంలో డబ్బులు డిమాండ్ చేశాడంటూ మండల అధ్యక్షుడిపై జనగామ పీఎస్‌లో మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన వ్యక్తి ఫిర్యాదు చేయగా, మరుసటి రోజే మరో వీడియోలో తనను ఎవరు డబ్బులు అడగలేదంటూ యూటర్న్ తీసుకున్నాడు.

దీంతో పార్టీ క్యాడర్‌లో అయోమయం నెలకొంది. ఎవరి వద్దకు వెళితే ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటున్నారు. అధిష్ఠానం కలుగజేసుకోకుంటే అధికార పార్టీకి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పెద్ద ఎత్తున నష్టం జరగడం ఖాయమంటూ సొంత పార్టీ నాయకులే పేర్కొంటున్నారు.

## ఓర్వలేకనే అసత్య ఆరోపణలు



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శిరీష్ రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కడియం శ్రీహరి నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జూలకంట్ల శిరీష్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ వందపడకల ఆస్పత్రికి బీఆర్ఎస్ ప్రభుత్వంలో జీవో తెచ్చానని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. జీవో తెచ్చిన వాళ్లు స్థల సేకరణ, నిర్మాణ పనులు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. అభివృద్ధి పైన ఆలోచన లేని వ్యక్తుల వల్లనే ఘన్‌పూర్ నియోజకవర్గం అభివృద్ధిలో పదేళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన ఇమేజ్‌తో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి, మునిసిపాలిటీ ఏర్పాటుకు జీవోలు తీసుకురావడంతోపాటు నిర్మాణ పనులు ప్రారంభించినా వారికి కళ్లు కనిపించడం లేదని ఎద్దేవా చేశాడు. కార్యక్రమంలో నాయకులు నెలమంచ అజయ్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, మంద రాజు పాల్గొన్నారు.

## 'డబ్బుల వసూలు'పై చర్చకు సిద్ధం

జనగామ, మే 20 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్ చెక్కుల మంజూరు కోసం తాను డబ్బులు వసూలు చేస్తున్నానంటూ కొంతమంది కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలపై జనగామచౌరస్తాలో బహిరంగ చర్చకు సిద్ధమని కాంగ్రెస్ బచ్చన్నపేట మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బచ్చన్నపేటకు చెందిన సాగర్ అనే వ్యక్తితో బలవంతంగా తనపై, నాగపురి కిరణ్‌కుమార్ గౌడ్‌పై పిటీషన్ ఇప్పించారని, చెక్కులతో సాగర్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. కిరణ్‌కుమార్ ఏళ్లుగా సీఎంఆర్ఎఫ్ చెక్కులను పేదలకు అందిస్తున్నారని, కానీ ఏ ఒక్కనాడు రూపాయి తీసుకోలేదని స్పష్టం చేశారు. తమపై బలవంతంగా పిటీషన్ ఇప్పించి కాంగ్రెస్‌ను భ్రష్టు పట్టించాలని చూస్తున్నారని విమర్శించారు.



చిన్నమడూరులో మాట్లాడుతున్న ఎంఈవో



జఫర్‌గడ్‌లో మాట్లాడుతున్న రఘునందన్‌రెడ్డి



బచ్చన్నపేటలో మాట్లాడుతున్న ఎంఈవో

## ఉపాధ్యాయుల శిక్షణ ప్రారంభం

బచ్చన్నపేట, మే 20(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధిలో భాగంగా ఉపాధ్యాయులకు వృత్త్యంతర శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు ఎంఈవో వెంకట్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మోడల్ పాఠశాలలో ఇందుకు సంబంధించిన శిక్షణ తరగతులను ప్రారంభించారు.

- జఫర్‌గడ్(ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను జఫర్‌గడ్‌లో తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఎంఈవో రఘునందన్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ అంశంలో ఇద్దరు చొప్పున ఆర్పీలు అవగాహన కల్పిస్తారన్నారు. సమావేశంలో ఎంఆర్పీలు రామానుజం, సోమయ్య, వెంకటేశ్వర్లు, మహేందర్, సుధాకర్‌రెడ్డి, శ్రీకాంత్, శ్రీనివాస్, నాగరాజు పాల్గొన్నారు.
- కొడకండ్ల(ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని జడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో శిక్షణ తరగతులను ఎంఈవో గ్రేస్ కేజియారాణి ప్రారంభించారు. ఉపాధ్యాయ వృత్తిలో కాలానుగుణంగా వచ్చే బోధనా పద్ధతుల్లో మార్పులను , మెలుకువలను నేర్పడం వల్ల భావితరాలకు ఉపయోగపడేలా విద్యార్థులను తీర్చిదిద్దడానికి ఉపయోగపడతాయన్నారు. ఉపాధ్యాయులు, సీఆర్పీలు జె.బాలాజీ, జ్ఞానానందం, అనిల్ పాల్గొన్నారు.
- దేవరుప్పుల(ఆంధ్రజ్యోతి): రాబోయే విద్యా సంవత్సరాలలో విద్యాబోధనకు ఉపాధ్యాయులకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని దేవరుప్పుల మండల విద్యాశాఖాధికారి బి.కళావతి అన్నారు. చిన్నమడూరులో శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్పీలు తిరుపతిరెడ్డి, శంకరయ్య, మాలతీ లత, సుహాసినీ, కిరణ్‌కుమార్, జ్యోతి, నర్సయ్య, కీర్తి, ఎమార్సీ సిబ్బంది రవీందర్ రెడ్డి, యాకస్వామి, మంజుల పాల్గొన్నారు.
- నర్మెట(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యబోధనలో నూతన పద్ధతులు పాటించాలని మండల విద్యాశాఖ అధికారి మడిపల్లి ఐలయ్య అన్నారు. నర్మెట మండలకేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల ఎస్జీటీ, ఎల్ఎఫ్ఎల్ ఉపాధ్యాయులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

## మహానాడు నిర్వహణ కమిటీలో హరీశ్‌కు చోటు



జనగామ, మే 20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27, 28, 29 తేదీల్లో ఏపీలోని కడపలో జరిగే టీడీపీ మహానాడు నిర్వహణ కమిటీలో జనగామకు చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు, నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి రామిని హరీశ్‌కు చోటుదక్కింది. మూడు రోజులపాటు జరగనున్న మహానాడు కోసం టీడీపీ పలు కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో భాగంగా పలువురు తెలంగాణ టీడీపీ నాయకులకు బాధ్యతలు అప్పగించారు. ఇందులో భాగంగా జనగామకు చెందిన రామిని హరీశ్‌కు వలంటీరుల నిర్వహణ కమిటీ సభ్యుడిగా అవకాశం కల్పించారు. హరీశ్ మాట్లాడుతూ మహానాడు విజయానికి కృషి చేస్తానని అన్నారు.

## పేలిన ట్రాన్స్‌ఫార్మర్

బచ్చన్నపేట, మే 20(ఆంధ్రజ్యోతి): పడమటికేశ్వాపూర్ గ్రామ శివారులో ఉన్న చల్లా ఏజెన్సీస్ రైస్‌మిల్లులోని ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో మంగళవారం పిడుగు పడింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ పేలి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. మిల్లులో పనిచేస్తున్న వారంతా ఏం జరిగిందో తెలియక ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని తలోదిక్కు పరిగెత్తారు. పేలిన టాన్స్‌ఫార్మర్ విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

## రజక ప్రతిభ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, మే 20(ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్‌సీ 2025 ఫలితాల్లో 560ఆపైన మార్కులు సాధించిన రజక విద్యార్థులు ప్రతిభ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని రజక ఉద్యోగ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వి.కొంరెల్లి, ప్రధాన కార్యదర్శి పి.సమ్మయ్య మంగళవారం తెలిపారు. ప్రభుత్వ హైస్కూళ్లు, సంక్షేమ గురుకులాలు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీలలో చదివిన విద్యార్థులు 28 లోపు టెన్త్ మెమో, కులం, నివాస పత్రాలు, రెండు ఫోటోలతో అందించాలన్నారు. వివరాలకు 9441454284, 94918 21598 సెల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

## ఏఈవోలు ఉండేలా చర్యలు తీసుకోవాలి

స్టేషన్‌ఘన్‌పూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): స్టేషన్‌ఘన్‌పూర్ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఉన్న రైతు వేదికలలో ఏఈవోలు అందుబాటులో ఉండడం లేదని, అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ నెమలిగొండకు చెందిన యువజన నాయకుడు అట్ల రాజు, మండల వ్యవసాయ అధికారి (ఏవో) చంద్రన్‌కుమార్‌కు మంగళవారం ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ రైతులు వారి అవసరాల కోసం ఏఈవోలకు ఫోన్ చేస్తే మండల కేంద్రంలోని కార్యాలయంకు రావాలని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో పాటు, ఫీల్డ్ విజిట్‌లో ఉన్నామని చెబుతున్నారన్నారు.

## ఘనంగా హనుమాన్ శోభాయాత్ర



దేవరుప్పుల(ఆంధ్రజ్యోతి): సీతారాంపురంలో మంగళవారం హన్‌మాన్ మాలధారులు హన్‌మాన్ శోభాయాత్రనిర్వహించారు. ఈసందర్భంగా ట్రాక్టర్‌పై హన్‌మాన్ ఫొటో ఫ్లెక్సీని ఏర్పాటు చేసి పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. మహిళలు జలకడవలతో నీరు పోసి, టెంకాయలు సమర్పించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గురుస్వామి పానుగంటి రామలింగం, మాలధారులు వరికెల రతన్, దూడల రఘు, తిమ్మాపురం అనిల్ పాల్గొన్నారు.

## మాలధారుల ప్రత్యేక పూజలు

నర్మెట, మే 20 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయంలో హనుమాన్ మాలధారులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాలధారులకు చివరి మంగళవారం కావడంతో గ్రామంలోని ఆంజనేయస్వామి విగ్రహలకు చందనాభిషేకం చేశారు. 22న హనుమాన్ జయంతి సందర్భంగా మాల విరమణ చేయనున్నట్లు స్వాములు తెలిపారు. కార్యక్రమంలో స్వాములు ఆమెడపు లక్ష్మారెడ్డి, అంజిరెడ్డి, కూరపాటి శ్రీనివాస్, కుమార్, చిర్ర రాజిరెడ్డి, పాతూరి కర్ణాకర్‌రెడ్డి, పులి నరేష్, నిమ్మకంటి బాపురాజు పాల్గొన్నారు.

## హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలి

బచ్చన్నపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ భక్తులు హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలని శివరామకృష్ణ భజనమండలి వ్యవస్థాపక అధ్యక్షుడు, రిటైర్డ్ సీఐ ఏపీ రాజయ్య కోరారు. మంగళవారం మండల కేంద్రంలో హనుమాన్ భక్తులనుద్దేశించి ఆయన మాట్లాడారు. భక్తిభావంతో, ఆధ్యాత్మిక చింతనతో గడపటం మూలంగా మానవునికి క్రమశిక్షణతో కూడిన జీవన విధానం అలవడుతుందన్నారు. బండనాగారం, కేశిరెడ్డిపల్లి గ్రామాల్లో భక్తులు హనుమాన్ శోభాయాత్రను నిర్వహించారు. కార్యక్రమాల్లో పూజారులు, భక్తులు చింతల బాలయ్య, కొత్తపల్లి రాజయ్య, దొంతుల చంద్రమౌళి, శ్రీనివాస్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

## బుగులు వేంకన్నకు సువర్ణ పుష్పార్చన



చిలుపూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): అష్టదళ పాదపద్మా రాధనను పురస్కరించుకుని చిలుపూర్ గుట్ట బుగులు వేంకన్న దేవాలయంలో సువర్ణ పుష్పార్చన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, ఈవో భాగం లక్ష్మీప్రసన్న స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. 108 బంగారు పుష్పాలను అలంకరించారు.

## కృత్రిమ కాళ్ల కోసం ఆర్థిక సాయం



శ్రీనివాస్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, మే 20(ఆంధ్రజ్యోతి): స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన సాంబారి శ్రీనివాస్ రైలు నుంచి దిగబోతు కింద పడి రెండు కాళ్లు పోగొట్టుకోగా కృత్రిమ కాళ్లు అమర్చుకోవడానికి ఎంపీ కడియం కావ్య ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి రూ.1.86లక్షలు మంజూరు చేశారు. ఈనిధుల మంజూరు ప్రొసీడింగ్స్‌ను ఎమ్మెల్యే శ్రీహరి మంగళవారం బాధితుడికి అందించారు. కార్యక్రమంలో నాయకులు అంబటి కిషన్ రాజు, పద్మశాలి సంఘ నాయకులు వి.సురేందర్, కె.కృష్ణమూర్తి, ఎం.వెంకటేశ్వర్లు, వి.శంకర్, మాజీ జడ్పీటీసీ స్వామినాయక్, సోమయ్య పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ

స్టేషన్‌ఘన్‌పూర్(ఆంధ్రజ్యోతి): స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన సీనియర్ నాయకుడు గట్టు యాదగిరి (74) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంగళవారం మృతుడి కుమారులు కాంగ్రెస్ నాయకుడు గట్టు శరత్, గట్టు రాజేందర్, గట్టు హర్శిష్లను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట పార్టీ మండలాధ్యక్షుడు జూలకంట్ల శిరీష్ రెడ్డి, సీహెచ్ నరేందర్ రెడ్డి, అంబటి కిషన్ రాజ్, కొలిపాక సతీష్, మంద రాజు, గట్టు రమేష్‌గౌడ్, గట్టు మనోహర్ గౌడ్ రాజశేఖర్ రెడ్డి, ధైద ఎలిషన్, అజయ్‌రెడ్డి, జీడి రమేష్, శివగౌడ్ పాల్గొన్నారు.

## ఆట స్థలాన్ని కేటాయించాలి

చిలుపూర్, మే 20 (ఆంధ్రజ్యోతి) : చిన్నపెండ్యాల మల్లంకుంట్ల లక్ష్మీనరసింహాస్వామి దేవస్థానం భూమిలో క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా ఆటస్థలాన్ని కేటాయించాలని బీఆర్ఎస్ నాయకుడు జనగామ యాదగిరి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బత్తుల రాజన్‌బాబు అధికారులను కోరారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఆలయ పరిధిలో మొత్తం 206 ఎకరాలుండగా, 119 మంది రైతులు ప్రస్తుతం సాగు చేసుకుంటున్నారని వివరించారు. వాకింగ్, ఆటస్థలం కోసం 5 ఎకరాల భూమిని కేటాయించేలా దేవాదాయ శాఖ అధికారులు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మోటం రాములు, గుంటి భీముడు, వెంకటేశ్వర్లు, గుంపుల రవిందర్‌రెడ్డి, జగన్నాథం, తాళ్ళపల్లి క్రాంతికుమార్, నారాయణగిరి సుగ్రీవచారి, ఇల్లందుల ప్రభాకర్ పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల పరిశీలన

నర్మెట, మే 20(ఆంధ్రజ్యోతి): వెల్దండలో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం తహసీల్దార్ రామానుజచారి పరిశీలించారు. కేంద్రంలో ఎంత ధాన్యం ఉందో రైతులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యాన్ని వెంటనే తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ధాన్యాన్ని ఆరబోసిన రైతులు కుప్పగా పోసుకొని వర్షానికి ధాన్యం తడవకుండా పరదలు కప్పుకొని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ సాయిబాబా పాల్గొన్నారు.

## హిందూ సమాజ చైతన్యమే ధ్యేయం

### వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సునీత



కార్యక్రమంలో మాట్లాడుతున్న సునీత

జనగామ కల్చరల్, మే 20(ఆంధ్రజ్యోతి): హిందూ సమాజ చైతన్యమే ధ్యేయంగా బాలసంస్కార శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విశ్వ హిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సునీతా రామ్మోహన్‌రెడ్డి అన్నారు. జనగామలోని సీతారామచంద్ర స్వామి దేవాలయంలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాల సంస్కార శిక్షణ తరగతులు మంగళవారం పదో రోజుకు చేరుకున్నాయి. వీహెచ్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన కృష్ణ భార్గవ అధ్యక్షత వహించగా సునీతా మాట్లాడుతూ జాగృతమైన హిందూ సమాజ చైతన్యాన్ని నిర్మాణం చేసేందుకు బాలసంస్కార శిక్షణ వర్గ ఏర్పాటు చేసిన విధానం, కార్యక్రమ రూపకల్పన, సరళి అభినందనీయమన్నారు. కృష్ణ భార్గవ మాట్లాడుతూ ఆదర్శవంతమైన, సంస్కారవంతమైన, సంఘటిత హిందూ సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఈ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చిలువేరు హర్షవర్ధన్, మైలారం శ్రీనివాస్, ఉల్లెంగుల రాజు, ఝాన్సీ మణి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.